ఈనాడు
చిత్తూరు
శనివారం 6 ఫిబ్రవరి 2016 20 పేజీలు

# శిక్షణ తరగతులతో ప్రజాప్రతినిధులకు మేలు

## మాజీ ఉప సభాపతి గుమ్మడి కుతూహలమ్మ



మాట్లాడుతున్న మాజీ ఉప సభాపతి డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మ, చిత్రంలో ఎంపీ డాక్టర్ వరప్రసాద్‌రావు

**తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే:** శిక్షణ తరగతులు ప్రజాప్రతినిధుల రాజకీయ ఎగుదులకు ఎంతో ఉపయోగపడతాయని మాజీ ఉప సభాపతి డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మ పేర్కొన్నారు. స్థానిక యూత్‌హాస్టల్‌లో భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమి(అగ్రశ్రీ) రాజీవ్‌గాంధీ జాతీయ యువజన అభివృద్ధి సంస్థ భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధుల సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలంటే గ్రామసీమలు అభివృద్ధిలో పయనించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులకు తమ విధులు, హక్కులపై అవగాహన ఉంటే మంచి పాలన అందించవచ్చని తెలిపారు. తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ వి.వరప్రసాద్‌రావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనతో ఎస్సీ, ఎస్టీల ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పథకాలను సంపూర్ణంగా వినియోగించినప్పుడే ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాందించుకోవచ్చని తెలిపారు. అనంతరం సామర్థ్య నిర్మాణ కార్యక్రమ మార్గదర్శిని ప్రతిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్రశ్రీ సంస్థ నిర్వాహకులు డాక్టర్ సుందర్‌రామ్, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు హరినాయుడు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు అమరనాథనాయుడు, భారతి, తదితరులు పాల్గొన్నారు.